ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10 సంచిక : 21 పుష్పం : 43-44 20-07-2005

రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 8/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ......................
26-06-05



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## నిన్ను నీవు తెలుసుకొంటే - నీవు నీవుగా ఉండగలవు

నన్ను నేను పొందాలంటే ముందుగా నన్ను నేను పోగొట్టుకోవాలి. అలా విడిచిపెట్టేవరకూ సహజమైన జ్ఞానం రాదు. అలా విడిచే సమయం రావాలంటే దేవునికి నేను అన్యమనే భావన ఉండకూడదు. మనం అత్యంత సహజమైన రీతిలో దైవీ జీవితంలో జీవించాలి. మనలను మనం ఉద్ధరించుకొంటే మన ద్వారా ప్రపంచం ఉంద్ధరించబడుతుంది. అహంకారంతో సంఘసేవ చేసినా ప్రయోజనం సున్నా. శిశువులు మనోహరంగా ఉంటారు. కారణం వారు ఇంకా అహంకారంతో చిక్కుకొని ఉండలేదు. పరమహంసగారు అంటారు "పసిపిల్లలవంటి హృదయం ఉన్నచోటే భగవంతుడు ఆకర్షింపబడతాడు. అంతేగాని తెలివికి, ప్రతిభకు అక్కడ స్థానం లేదు" అని. మనలో నిస్వార్థ భక్తి - ఆత్మార్పణం ఉంటే అప్రయత్నంగా ఇతరులను ముగ్ధులను చేస్తాము. ప్రేమ స్వరూపుణ్ణి అందరూ ప్రేమిస్తారు. మనలో కించెత్తు స్వార్థ ఆవేశాలు ఉన్నా అది మనలను పాడుచేస్తుంది. ఇది కష్టమైన విషయమే కాని ఇంతకన్న ఇంకో మార్గం లేదని నిస్సంశయంగా చెబుతారు. మన ఋషులు మనలను మనం అర్థం చేసుకోవటానికి ఎంతో వినయం అవసరం అన్నారు. నన్ను నేను ఎరుగుదును అంటూ మనం ప్రారంభిస్తే ఇక తెలుసుకోవటం అనేది మానేశామన్న మాట. "నేను" జ్ఞాపకాలు, అభిప్రాయాలు, అనుభవాలు, అనుభూతులు, సాంప్రదాయాల పోగు మాత్రమే. నిజమైన "నేను"లో ఇవి ఏమీ లేవు. ముందుగా మనం త్రికర్ణ శుద్ధిని అలవర్చుకోవాలి. ఈ ప్రపంచం అసత్యమని ముందు

నిర్ణయించుకోకపోతే మనస్సు అంతర్ముఖం కాదు. ఈ దృశ్య ప్రపంచంలో రంగులు, ఆకారాలు, వికారాలు, మనలను బంధిస్తున్న సమయంలో మనం సమయస్ఫూర్తిని, యుక్తిని అత్యంత జాగరూకతతో ఉండి గురువు నుంచి వచ్చే అత్యంత సూక్ష్మమైన ఈ స్ఫురణను ఆసరాగా తీసుకొని "చూచే నేను ఎవడను? చూడబడేది ఏమిటి? ఎలా చూడబడుతోంది అంటే ఆత్మ వెలుగులోనే మనోఫలకం ద్వారా చూడబడుతోందని స్పష్టంగా తెలిపే జ్ఞానం సంపాదిస్తే యదార్థం బోధపడుతుంది. భ్రమ నశిస్తుంది. బ్రహ్మం వ్యక్తమౌతుంది. అప్పడే మనం మనంగా ఉండగలము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 26-06-05, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనుషులు రకరకాలుగా ఉంటారు. ఎవడిగుణాన్ని బట్టి, ఎవడి స్వభావాన్ని బట్టి వాడు ప్రవర్తిస్తూ ఉంటాడు, దానిని మార్చటం చాల కష్టం. వర్షం వస్తోందని భగవంతుడిని తిట్టవద్దు, ప్రకృతిని తిట్టవద్దు గొడుగు వేసుకొని వెళ్ళు, రోడ్డు మీద ముళ్ళు ఉన్నాయని రోడ్డుని తిట్టవద్దు, జోళ్ళు వేసుకొని వెళ్ళు అలాగే ప్రపంచంలో రకరకాలు మనుషులు ఉంటారు. వారి గుణాల గొడవ నీకు వద్దు, ఇవన్నీ మనస్సుకు సంబంధించినవి. నీ మనస్సు నువ్వు కాదు, వాడి మనస్సు వాడు కాదు అది నీకు అర్థం అవ్వాలి. ఈ గొడవలలోనికి వెళ్ళకుండా అందరి హృదయంలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని చూడటం నేర్చుకో. రాగం వలన సంతోషం, ద్వేషం వలన దుఃఖం వస్తుంది. సాధన చేసి రాగద్వేషములను తొలగించుకొంటే హృదయంలో ఉన్న ప్రభువు మనకు వ్యక్తమవుతాడు. విడిపోవటం, కలుసుకోవటం ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు, ఇవి చైతన్యానికి సంబంధించిన విషయాలు కాదు. గుణాలు అన్నీ మనస్సులో ఉన్నాయి. ఆ గుణాలను బట్టి జన్మలు వస్తాయి. రమణభగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఈ గుణాలు అన్నీ ఏ మనస్సులో అయితే ఉన్నాయో ఆ మనస్సు నువ్వు కాదు ఈ విషయం మీరు బాగా అర్థం చేసుకోండి. బయట ఏదో ఉంది, బయట ఏదో ఉంది అని మనం అనుకొంటూ ఉంటాము. బయట ఏమీ లేదు. మన మనస్సులో ఉన్నదే బయట కనిపిస్తోంది. భక్తిమార్గం, ధ్యానమార్గం, జ్ఞానమార్గం అన్నీ కూడా మనస్సు అణగటానికే.

మనస్సు అణిగితేనేగాని, మనస్సుకు లోచూపు వస్తేకాని ఆత్మసుఖం తెలియదు. ఉన్నది ఒక్కటే వస్తువు, అదే బ్రహ్మం. ఆ బ్రహ్మమే మనకు జీవుడిగా, దేవుడిగా, లోకంగా కనిపిస్తోంది. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఉండేదే బ్రహ్మం. ఈ శరీరం రాకముందు, శరీరం వచ్చిన తరువాత, శరీరం పోయిన తరువాత కూడా ఉండేదే బ్రహ్మం. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో ఏదైతే ఉందో అది నీవై ఉన్నావు కాని దాని తాలుక అనుభవం నీకు లేదు, దానికి కారణం మనలో ఉన్న రాగద్వేషములు. మనలోపల ఉన్న సత్యవస్తువును తెలుసుకోవటానికి ఏవైతే అడ్డుగా ఉన్నాయో వాటిని తొలగించుకోవటానికి భగవంతుని పాదాలను అశ్రయించాలి, అదే భక్తిమార్గం. కృష్ణుడు ఉద్ధవుడితో ఏమి చెప్పాడు అంటే అర్జునుడికి ఏదోచేయాలి, ఏదోచేయాలి అనే ప్రవృత్తి ఎక్కువ అందుచేత వాడికి కర్మ మార్గం చెప్పాను. భగవంతుడి పాదాలను ఆశ్రయించి, తరించాలనే ప్రవృత్తి నీలో ఎక్కువగా ఉంది. అందుచేత నీకు భక్తి మార్గం చెప్పాను. అర్జునుడికి కర్మమార్గంలో తరించే అవకాశం ఎక్కువగా ఉంది, నీకు భక్తి మార్గంలో తరించే అవకాశం ఎక్కువగా ఉంది. అందుచేత ఎవడి మనస్సుకు తగినట్లుగా వాడికి చెప్పాను. ఇద్దరూ మనస్సును అతిక్రమించాలి, బాగుపడాలి. కర్మఫలకాంక్ష లేనివాడు ఏకోరికలు లేనివాడితో సమానము. మనం ఏదైనా పనిచేసేటప్పుడు ఫలితంపట్ల ఆశ లేదు అనుకోండి ఫలితం వచ్చినా గర్వం ఉండదు, ఫలితం రాకపోయినా దుఃఖం ఉండదు, వాడు కృంగిపోడు. అందుచేత వాడు పనిచేస్తున్నా వాడు కోరికలు లేనివాడితో సమానం ఇది బాగా అర్థం చేసుకోండి. ఇలా పనిచేయటం వలన పనిపూర్తి అవుతుంది, వాడి బుద్ధి బాగుపడుతుంది. చేతిలో డబ్బు ఉంటే వస్తువు కొనుక్కోవటం ఎంత తేలికో మన బుద్ధి బాగుపడినప్పడు, సంస్కరింపబడినప్పడు మోక్షం రావటం అంతే తేలిక. సద్బుద్ధి ఉన్నవాడు, సహృదయం ఉన్నవాడు నాకు మోక్షం కావాలని అడగడు, వాడి అర్హతను బట్టి, యోగ్యతను బట్టి, ఈశ్వరుని పాదాలయందు వాడికి ఉన్న భక్తిని బట్టి, వాడి వాంఛారహితస్థితిని బట్టి మోక్షమే వచ్చి వాడిని వరిస్తుంది. పూజలు, జపాలు, ధ్యానాలు, తీర్థయాత్రలు ఇవిఅన్నీ కూడా మన బుద్ధిని బాగుచేసుకోవటానికే వచ్చే జన్మలో ఏదో వస్తుంది అనుకొంటాము, వచ్చే జన్మలో ఏమీ రాదు, మన మనస్సులో ఉన్నదే అక్కడ కనిపిస్తుంది. మాయ అంతా మనస్సులోనే ఉంది. భగవంతుని పాదాలను ఆశ్రయించకుండా, భగవంతునియందు భక్తి లేకుండా మనం మాయలో నుండి విడుదలపొందలేము. దుఃఖం లేకుండా మనకు రోజులు వెళ్ళాలంటే

కర్తృత్వభావనను విడిచిపెట్టాలి అని రమణస్వామి చెప్పారు. ఇది నేను సాధించాను, అంతా నా వలననే అవుతోంది అనుకోవటం ఎటువంటిదిఅంటే రైలులో ప్రయాణించేవాడు రైలుకు బరువు అవుతుందని పెట్టెను నెత్తిమీద పెట్టుకొన్నట్లుగా ఉంటుంది. పెట్టెను ప్రక్కన పెట్టుకుంటే ఆ బరువు వాడు మోయనక్కరలేదు, ఆ పెట్టెకూడా వాడితోపాటు వచ్చేస్తుంది. అదేవిధంగా నీవు అహంకారం లేకుండా జీవిస్తూ ఉంటే పనిపూర్తి అయిపోతుంది, నీవు మోక్షాన్ని పొందుతావు. కర్తృత్వభారాన్ని వదిలించుకో, అదే సాధన. చేసేది భగవంతుడే, అసలు ఉన్నదే ఆయన. కాని ఏదో ఉంది, ఏదో ఉంది అని నీవు అనుకొంటున్నావు. భగవంతుడిని విడిచిపెట్టి నేను ఉన్నాను అని విజృంభించే ఆ నేనును నాశనం చేయకుండా, దానిని శిలువవేయకుండా హృదయంలో ఉన్న భగవంతుడు నీకు వ్యక్తంకాడు. అహంభావన ఉన్నంతసేపు ఏవో భావనలు, ఏవో తలంపులు వస్తూనే ఉంటాయి. అహంభావనను శిలువ వేసావా నీవు అమృతత్వాన్ని పొందుతావు. మీకు అందరికి మాటలు అంటే ఇష్టంగా ఉంది కాబట్టి మాటలు చెపుతున్నాను, మాటలకంటే మౌనం శక్తివంతమైనది, మౌనం వలన మార్పు వేగంగా వస్తుంది. నీవు సబ్జక్టు బాగా అర్థంచేసుకో, నీ బుద్ధికి పట్టించుకో. ఈ చనిపోవటం, పుట్టటం నిజంకానే కాదు, ఇది అంతా మనస్సు చేసే గారడీ. పారమార్థిక సత్యం, ప్రాతిభాసిక సత్యం, వ్యవహారికసత్యం అంటారు. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో, అంతటా ఉండేదే పారమార్థిక సత్యం. కొంతమంది మంచివారిని చెడ్డవారిగా అనుకొంటారు, అది ప్రాతిబాసిక సత్యం. అంటే తాడును చూసి పాము అనుకోవటం, ఉన్నది ఒకటి, నీకు కనిపించేది వేరొకటి అలానే ఉన్నది బ్రహ్మమే కాని నీకు లోకంగా, జీవుడిగా కనిపిస్తోంది, ఇవి ప్రాతిబాసిక సత్యాలు. మనం సత్సంగాలు పెట్టుకొని మాట్లాడుకొంటున్నాము, మనలో బేదబుద్ధి ఉంది ఏదో చెప్పకొంటున్నాము, ఇవి అన్నీ వ్యవహారిక సత్యాలు. మొఖాన్ని చూసి పీటలు వేస్తారు చూడండి, అది మాయ చేసే పని. మాయకు కొలతలు అంటే ఇష్టం, జ్ఞానానికి శాంతికి కొలతలు ఎలా ఉంటాయో తెలియదు. ఎవరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, ఏ గురువును ఆశ్రయించినా దేహబుద్ధి నశించకుండా, దేహాభిమానం నశించకుండా ఆత్మసుఖం తెలియదు. అభిమానం నశించకుండా అశాంతి నశించదు, అవిద్య నశించదు. నిద్రలో మీకు స్వప్నాలు వస్తాయి. ఆ స్వప్నంలో రైళ్లలో, విమానాలలో ఎక్కడికో తిరిగినట్లు వస్తుంది, కాశీ వెళ్లినట్లు స్వప్నంలో వస్తుంది. నీవు నిజంగా కాశీ వెళ్లావా, లేదు కాని కాశీ వెళ్లటం, రావటం ఇది అంతా నీ

మనస్సులో జరిగింది. కాని బయట జరిగినట్లు నీకు అనిపిస్తోంది. ఈ చావులు, పుట్టుకలు, స్నేహాలు, విరోధాలు ఇవి అన్నీ మనస్సులో జరుగుతున్నాయి, బయట జరగటం లేదు అని నీకు అర్థమవ్వాలి, అది అర్థమయితే నీకు మనోనాశనం అవుతుంది, అప్పడు నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. బయట ఏమీ లేదు, అంతా మనస్సులోనే ఉంది, మనస్సును విడిచిపెట్టి మాయలేదు అన్నారు ఆచార్యులవారు. నేను చనిపోతున్నాను అని, పుడుతున్నానని ఎక్కడ అనుకొంటున్నావు, నీ మనస్సులో అనుకొంటున్నావు. లోకం ఉందని, దేవుడు ఉన్నాడని, స్వర్గలోకానికి వెళ్ళాలని, నరకలోకానికి వెళితే బాధలు పెడతారని ఇది అంతా నీ మనస్సులోనే అనుకొంటున్నావు. మనస్సును విడిచిపెట్టి ఏమీ లేదు, అన్నీ మనస్సులోనే జరుగుతున్నాయి, మనస్సు నశించే వరకు ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. మనస్సు ఉంటే అన్నీ ఉన్నాయి, మనస్సును తీసి ఒక ప్రక్కన పెడితే ఏమీ లేదు, నీవు మిగులుతావు. నీకు చెడ్డ కల వచ్చింది అనుకో, మెలకువ వచ్చాక అమ్మయ్యా ఇది అంతా నిజం అనుకొన్నాను, కాని ఇది నిజం కాదు అనుకొంటారు అలాగే నీకు ఆత్మజ్ఞానం కలిగాక ఎక్కడో పుట్టాను, ఎక్కడో చనిపోయాను ఇది అంతా నిజం అనుకొన్నాను కాని ఇది నిజం కాదు అని అప్పడు నీకు గోచరిస్తుంది, అప్పడు మీరు సుఖపడతారు, శాంతి కలుగుతుంది. మన జేబులో డబ్బు 10 రూపాయలు ఎవరైనా తీసేసారు అనుకోండి, తీసిన వాడిది ఎంత పొరపాటో, మనది కూడా అంతే పొరపాటు. ఎందుచేతనంటే మనం అజాగ్రత్తగా ఉండకపోతే వాడు తీయడు కదా. ఏమిటి మనకు ఇటువంటి గురువు దొరికాడు అని అనుకొంటారు కాని గురువును ఎన్నుకోవడంలో మనదే పొరపాటు కాని గురువుది పొరపాటు కాదు, వాడి మనస్సుకు తగిన గురువు వాడికి దొరుకుతాడు. గురువు మంచివాడు కాదు అని వీడు అనుకొంటాడు కాని వీడు గురువును ఎన్నుకోవటంలో పొరపాటు చేసానని అనుకోడు, గురవును ఎన్నుకోవటంలో వాడి అజాగ్రత్త వాడికి తెలియటం లేదు. లౌకిక ప్రయోజనాల కోసం, ఆకర్షణల వలన సరిఅయిన గురువును ఎన్నుకోలేకపోతున్నాము, మోక్షమార్గాన్ని తప్పిపోతున్నాము. మీ అమ్మాయి అమెరికానుండో, ముంబాయి నుండో వచ్చింది అనుకోండి, ఎదురుగా గంటలతరబడి కూర్చుని చూసుకొంటూ ఉంటారు, ఎందుకు అంటే అది మనస్సుకు సంతోషం. ఎక్కడయితే రాగం ఉందో అక్కడ సంతోషం, మనం దానికోసమే బతుకు చున్నాము. అసలు వస్తువు అనుభవంలోనికి వచ్చినప్పడు మీకు సంతోషాలకు సంతోషం

వస్తుంది. ఇప్పుడు ఇక్కడ మీకు ఇష్టమైన వారిని కళ్ళతో చూడటం వలన సంతోషం వస్తోంది కాని అక్కడ చూడటంతోటి, వినటంతోటి సంబంధం లేకుండా, మీ మనస్సుకు పని కల్పించ కుండా స్వతంత్రమైన సుఖం, శాంతి ఉరకలు వేసుకొంటూ వచ్చి మిమ్మల్ని ముంచుతుంది. అప్పుడు మీ శరీరానికి చావు వచ్చినా మీకు ఏమీ అనిపించదు.

ఎక్కడయితే ఇష్టం ఉందో అక్కడ సంతోషం ఉంది, ఆ సంతోషం కోసమే మనిషి బతుకుచున్నాడు అని వాడికి తెలియదు. మనకు ఇష్టంలేనివారు కనబడితే దూరంగా పారిపోవాలనిపిస్తుంది, పొద్దుటే లేచినవెంటనే వీడు కనిపించాడు ఏమిటి అనిపిస్తుంది, ఇష్టంలేనివాడు కనబడితే దుఃఖం, ఇష్టమైనవాడు కనబడితే సంతోషం. రాగంవలన సంతోషం, ద్వేషం వలన దుఃఖం వస్తుంది. కొంతమంది ఏమంటున్నారు అంటే ఈ రాగాలు భగవంతుని పట్ల ఉంటే ఎంత బాగుండును అంటారు. కొంతమంది గురువు ఫొటో చూసుకొంటూ సంతోషపడుతూ ఉంటారు, మీ అమ్మాయిని మీరు ఎలా చూసుకొంటారో అలాగ గురువుని, అవతారపురుషుడిని చూసుకొంటూ ఉంటారు, అటువంటి రాగం కనుక భగవంతుని పట్ల ఉంటే సంతోషానికి సంతోషమైనట్టి పరమాత్మ దగ్గరకు నిన్ను చేరుస్తుంది. రాగద్వేషములు మనస్సులో ఉన్నాయి. గాఢనిద్రలో మనస్సు లేదు, అక్కడ రాగద్వేషములు లేవు మరి గాఢనిద్రలో నీవు లేవా అంటే ఉన్నావు కాని రాగద్వేషములు లేవు, దేవుడు లేడు, లోకం లేదు, పునర్జన్మ లేదు, ఏమీ లేవు. ఒక్కటి అంటే ఒక్కటిగా నీవు ఉన్నావు, ఆస్థితిని నీవు జాగ్రదవస్థలో పొందు, అదే నీకడసారి జన్మ, నీ దుఃఖం శిలువ వేయబడుతుంది. భగవంతునిపట్ల తపన ఎక్కువ కావాలి, భగవంతుని లీలలు వింటూ ఉండాలి, భగవంతుని రూపాన్ని చూస్తూ ఉండాలి, మీ అమ్మాయిని చూస్తూ ఉంటే మీకు గంటలు నిమిషాలలాగ వెళ్ళిపోతాయి. అలాగ భగవంతుని దగ్గర కూర్చుంటే రోజులు నిమిషాలలాగ వెళ్ళిపోవాలి అటువంటి తపన, జిజ్ఞాస నాకు కలుగజెయ్యి, నీ కరుణ లేకపోతే అవి కలుగుతాయా, ఎన్ని జన్మల పుణ్యం వలననో కదా అటువంటి ఆసక్తి కలగటం. నేను జిన్నూరులో ఉన్నాను అనుకొంటాను, ఆ అమ్మగారు దర్భరేవులో ఉన్నాను అనుకొంటారు, ఈ దూరం, దగ్గర, కాలం ఇవి అన్నీ మనస్సు యొక్క కల్పితం. బ్రహ్మం వీటి అన్నింటికి అతీతం, దానిని పొందేవరకు నీవు తరించలేవు. నీకు ఎప్పుడయినా ఏకాగ్రత కుదిరితే ఒక్కరోజు ఒక్కక్షణంగా వెళ్ళిపోతుంది, ఏకాగ్రత కుదరకపోతే

ఒక్క క్షణం ఒక్క రోజుగా ఉంటుంది, ఇది అంతా మనస్సు యొక్క కల్పితం. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. అదే దేవుడిగా, జీవుడిగా, లోకంగా కనిపిస్తోంది, ఈ మూడూ కల్పితాలే, ఈ మూడూ మాయే, ఇవి దాటితే కదా మోక్ష సుఖం మనకు అందేది. విత్తనం మొక్క అవ్వటానికి గాలి, నీరు, వెలుతురు ఎలా సహాయం చేస్తాయో అలాగే నీ మనస్సులో ఉన్న గుణాలు అన్నీ బయటకురావటానికి లోకంలో ఉన్న మనుషులు, పంచభూతాలు అన్నీ సహకరిస్తాయి అంతకంటే లోకం అంటూ ఏమీలేదు, ఊరికే భ్రాంతిపడుతున్నారు అంటున్నారు ఆచార్యుల వారు. రాబోయే జన్మ ఇంత గొప్పగా ఉంటే బాగుండును అని కొంతమంది అనుకొంటూ ఉంటారు, ఇది అంతా మనస్సు యొక్క కల్పితం, రాబోయే జన్మ మీరు అనుకొన్నట్లుగా వచ్చినా అది కూడా మాయే, నూటికి నూరుపాళ్ళు అసత్యమే. నీ మనస్సు నిజం అనుకొంటున్నారు కాబట్టి నీ మనస్సులో ఉన్న గుణాలు అన్నీ నిజం అనిపిస్తున్నాయి. శరీరంలో మాంసం, ఎముకలు, రక్తం ఎలా ఉన్నాయో అలాగ మనస్సులో గుణాలు ఉన్నాయి. బ్రహ్మం నిర్గుణం, నిరాకారం, దానికి మార్పులేదు, వికారం లేదు, బ్రహ్మం అన్‌రిలేటెడ్. మన ప్రక్కన ఉన్న వారిని తల్లి అని, తండ్రి అని, మావయ్య అని, భర్త అని ఇలా మన శరీరంతో ఉన్న సంబంధాన్ని బట్టి చెపుతాము, అంటే మన శరీరాన్ని కేంద్రంగా పెట్టుకొని దానితో వారికి ఉన్న అనుబంధాన్ని చెపుతాము కాని బ్రహ్మం అలాకాదు, దానికి ఇంకో వస్తువుతోగాని, పంచభూతాలతోగాని దేనితోనూ దానికి సంబంధం లేదు. అది ఒక్కటి అంటే ఒక్కటే. మీరు శరీరం అనుకొంటు న్నారు కాబట్టి, వారి శరీరాలను మీ శరీరంతో పోల్చుకొని బాంధవ్యాలు చెపుతున్నారు, బ్రహ్మం అలా కాదు, అది స్వతంత్రమైనది, అది ఒక్కటి అంటే ఒక్కటే దానికి భిన్నంగా ఏమీ లేదు, అందుచేత దానికి అనుబంధం లేదు. అదే బ్రహ్మం. మన జీవలక్షణాలు బ్రహ్మంకాదు, మనకు తెలుసున్న వ్యవహారిక జ్ఞానం బ్రహ్మం కాదు, ప్రాతిబాసిక జ్ఞానం బ్రహ్మం కాదు, మన మనస్సుతో కల్పించుకొన్నవి బ్రహ్మం కాదు. మనం శరీరంతోటి, మనస్సుతోటి, బుద్ధితోటి తాదాత్మ్యం పొందుతాము కాబట్టి జీవలక్షణాలు వస్తాయి, మనకు దేనితోనూ తాదాత్మ్యం లేకపోతే జీవలక్షణాలు లేవు. ఈ జీవలక్షణాలు వ్యక్తమవ్వటానికే పంచభూతాలు, లోకం, మనుషులు, చుట్టాలు, విరోధులు అంతా సిద్ధమవుతారు. మనస్సును అతిక్రమించినప్పుడు కదా మనకు ఆత్మసుఖం దొరికేది, అప్పుడు కదా ఇతర వస్తువులతోటి, వ్యక్తులతోటి సంబంధం లేని శాంతి మనకు లభ్యమయ్యేది. అట్టి ఆత్మసుఖంలోనికి నిన్ను మేల్కొలిపేవాడే గురువు,

అటువంటి గురువును ఎన్నుకోలేకపోతే అందులో నీ పొరపాటు ఉంది, నేరం గురువు మీద పెట్టవద్దు. ఇక్కడ వంకాయల రాశి ఉంది అనుకో, వాడు తీసుకొని వెళ్లమని చెపుతాడు, మనం సరిఅయినవి ఏరి తీసుకోవాలి, అలా తీసుకోకపోతే అందులో మన పొరపాటు ఉంది, కేవలం అమ్మేవాడిది పొరపాటుకాదు.

ఆచార్యులవారు రిపీటెడ్‌గా చెపుతూ ఉండేవారు స్వప్నం అంతా నీ మనస్సులోనే జరుగుతోంది, కాని బయట జరుగుతోందని నీ మనస్సుకు అనిపిస్తుంది. ఉన్నదంతా నీ మనస్సులోనే ఉంది, మనస్సును తీసివేస్తే లోకం అంటూ ఏమీలేదు అది నీకు అవగాహన కావాలి. మనస్సు అంతర్ముఖం అయినవాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది, శాశ్వతసుఖం వాడిని వరిస్తుంది. ఎవడైతే నీ మనస్సుకు అంతర్ముఖత్వం కలుగజేస్తున్నాడో వాడే గురువు. మీరు మంచిపనులు చేయటం ముఖ్యం కాదు. ఈ మంచిపనుల ద్వారా ఏది పొందాలో అది గుర్తు పెట్టుకో. మంచిపనులను నీనెత్తిమీద మోయవద్దు, చేసి మర్చిపో. కొంతమంది కాఫీ ఇచ్చి వంద ఏళ్ళు గుర్తుపెట్టుకొంటారు, వారు కాఫీ ఇవ్వకపోవటం మంచిది. కాఫీ ఇచ్చింది అహంకారం, గుర్తు పెట్టుకొనేది అహంకారం, వాడు కాఫీ ఇవ్వకపోతేనే బాగుపడతాడు ఎందుచేతనంటే కాఫీ ఇచ్చి నేను కాఫీ ఇచ్చాననే కర్తృత్వం పెంచుకొంటున్నాడు, ఆ కర్తృత్వ భారం వలననే దుఃఖం వస్తుంది. నువ్వు ఏదో మంచిచేస్తే దాని ఫలితం ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. చేసేవాడు జీవుడు, ఫలితాన్ని ఇచ్చేవాడు భగవంతుడు. ఆ ఫలితం నీకు సుఖ రూపంలో ఖర్చు అయిపోతుంది. చెడ్డ దుఃఖరూపంలో, మంచి సుఖరూపంలో ఖర్చు అయిపోతుంది, మంచి అయినా చెడ్డ అయినా ఇది అంతా మనస్సే. మనస్సును అతిక్రమించ కుండా నీకు ఆత్మజ్ఞానం కలుగదు అని ఆచార్యులవారు చెప్పారు. నాకు భగవంతుడి మీద ఇష్టం పెరగాలి, రక్తి పెరగాలి, తపన పెరగాలి. ఇష్టం కూడ మనస్సులోనిదే కాని నీ మీద ఇష్టం కలిగాక లోకం మీద ఉన్న ఇష్టాలు పోతాయి, పరమేశ్వరుని మీద ఉన్న ఇష్టం వలన వచ్చే సంతోషానికి దుమ్ము, ధూళి అంటుకోదు, ఇది పరమ సంతోషాన్ని పొందింపచేస్తుంది. అందుచేత నీ మీద ఇష్టం కలిగేటట్లు, రక్తి కలిగేటట్లు చెయ్యి. నీ పట్ల రక్తి లేకుండా, ఇష్టం లేకుండా నిన్ను నేను ఎలా పొందగలను. ఈ రక్తి కూడా మనస్సులోనిదే అంటావు ఏమో కాని నీ మీద ఉన్న రక్తి ఈ మనస్సును అతిక్రమించటానికి ఉపయోగపడుతుంది, అది నీ

మనస్సును డైనమైట్‌లాగ పేల్చేస్తుంది. ఇప్పుడు నీ మీద నాకు ఎంతో కొంత రక్తి ఉంది అనుకో, అది చెదిరిపోకుండా దానిని దృఢపరచు, ప్రాణప్రయాణ సమయంలో కూడా నీ ధ్యాసే నాకు మిగలాలి ఎందుచేతనంటే ఉన్నది నీవు ఒక్కడివే కాబట్టి. ఆ తపన, ఆ రక్తి నీకు ఉంటే అదే నిన్ను పరమేశ్వరునిలో ఐక్యపరుస్తుంది అంటున్నారు రమణాచార్యులు. అందుచేత భక్తిని అభివృద్ధిచేసుకో, నీ రక్తిని అభివృద్ధి చేసుకో. ఎంతవరకు అభివృద్ధి చేసుకోవాలంటే పరమేశ్వరునిపట్ల నీకు ఉన్న భక్తిలో, ఆ రక్తిలో, ఆ తపనలో నీకు పునర్జన్మలకు ఏ మనస్సు అయితే కారణమో అది పూర్తిగా కరిగిపోవాలి, అంతవరకు అభివృద్ధి చేసుకో. ఉద్ధవా! నీ బుద్ధి చాలా మంచిది, ఇది సాధించాలి, అది సాధించాలి అనే బుద్ధి నీకు లేదు, లోకం అంతా నన్ను గొప్పగా చెప్పకోవాలనే బుద్ధి నీకు లేదు, నీకు భగవంతునిపాదాలు తప్పించి ఏమీ అక్కరలేదు, నీకు లోకానికి సంబంధించిన వాసనలు లేవు, దేహవాసన లేదు, అందుకే నీకు భక్తిమార్గం చెపుతున్నాను, కృష్ణుడి శరీరం లేదు అనుకోవద్దు, నేను ఈ శరీరం విడిచిపెట్టినప్పడు నీవు బదరికాశ్రమం వెళ్ళిపో, అక్కడ నారాయణ స్మరణ చేసుకొని తరించు, నీకు భక్తి మార్గం చాలు అని కృష్ణుడు ఉద్ధవుడికి చెప్పాడు. భక్తులకోసం భగవంతుడు ఒక ఆకారం ధరించి వస్తాడు, వాడికి పని ఏమీ లేదు. ఈశ్వరుని కాంక్షించు, ఈశ్వరుని ఏ మనస్సు అయితే కాంక్షిస్తోందో చివరకు ఆ మనస్సు కర్పూరంలాగ కాలిపోతుంది, ఏమీ మిగలదు. భగవంతుడి రూపాన్ని ధ్యానిస్తూ, ఆయన నామాన్ని స్మరిస్తూ జీవిస్తూ ఉంటే నీకు ఏకాగ్రత కలుగుతుంది. మీ ఇంట్లో ఇనుపపెట్టె ఉన్నా దాని వలన ప్రయోజనం లేదు, దానిని తెరిచే తాళం మన దగ్గర ఉండాలి. అలాగే మన హృదయంలో భగవంతుడు ఉన్నా ప్రయోజనం లేదు, ఆయనను తెలుసుకోవటానికి ఏకాగ్రత అనే తాళంచెవి సాధించాలి అని వివేకానందుడు చెప్పారు. నీకు ఏ గురువు అయితే ఇష్టమో, ఏ దేవుడు అయితే ఇష్టమో ఆ రూపంతోటి, ఆ నామంతోటి నీ మనస్సు అంతా నిండిపోవాలి, అలా నీమనస్సు నిండిపోతే ఇంకో తలంపు రానేరాదు. భక్తిభావన మనకు కుదిరింది అనుకో దానివలన వచ్చే సుఖాన్నే మనం భరించలేము. నువ్వు ఏ అవతారపురుషుడిని అయితే ఆరాధిస్తున్నావో, ఏ గురువు నయితే ఆరాధిస్తున్నావో ఆరూపం తోటి, నామంతోటి నీ మనస్సు ఒకటి అయిపోవాలి. ఎటుచూసినా నీకు ఆయన రూపమే కనబడాలి, ఆయన మాటలే నీకు వినబడాలి. ఆ మాటే నీకు వేదం, అదే నీకు మంత్రం. మనం భగవంతుడిని ఆరాధించినా, జపం చేసినా, ధ్యానం చేసినా

ఎన్నిచేసినా బుద్ధిని బాగుచేసుకోవటానికే అని గుర్తుపెట్టుకోండి. మన బుద్ధి నూటికి నూరుపాళ్ళు బాగుపడిందా మన హృదయంలో ఉన్న ఇనుపపెట్టెను తీసుకొనే తాళం చెవి మనకు అందుతుంది. ధనం పెరిగిన వాడికి భోగం వస్తుంది, బుద్ధి బాగుపడిన వాడికి మోక్షం వస్తుంది. డబ్బు తీసుకొనివచ్చేది భోగం, బంధం. బుద్ధి బాగుపడితే వచ్చేది మోక్షం. నీ బుద్ధి సంస్కరింపబడితే, నిర్మలం అయితే, నీ బుద్ధిలో ఏ దోషం లేకపోతే నీవు భగవంతుడి దగ్గరకు వెళ్ళనక్కరలేదు, భగవంతుడే మన దగ్గరకు వస్తాడు. ఈ మీటింగులు విన్నా, మనం మంచిపనులు చేసిన, భాగవతం రామాయణం అధ్యయనం చేసినా ఇవి అన్నీ కూడా మన బుద్ధిని బాగుచేసుకోవటానికే చేస్తున్నాము అని మర్చిపోవద్దు. మన బుద్ధిని బాగుచేసుకోక పోతే ఎవడో వచ్చి మనలను శిక్షించనక్కరలేదు, మన బుద్ధే మనలను శిక్షిస్తుంది. ఈశ్వరుడు ఆయన శక్తి ఎటువంటిదో ఆయన చూపిస్తే మనం చూడగలము కాని, దానిని మన బుద్ధితో కొలవలేము. అంతా ఈశ్వరసంకల్పం ప్రకారం నడుస్తోంది, జరిగేది అంతా భగవంతుడి సంకల్పమే, ఉన్నది ఆయన ఒక్కడే అనే అనుభవం నీకు వస్తే దుఃఖంతోటి నీకు పని ఏముంది అంటున్నారు రమణాచార్యులు. మీరు లేరు, ఉన్నది భగవంతుడు ఒక్కడే, చేసేది అంతా ఆయనే కాని నేను చేసాను అనుకొంటున్నావు దానికి రజోగుణం కారణం. ఉన్నది ఆయనే, చేసేది ఆయనే కాని ఆయన చేసిన పనిని నేను చేసాను అంటున్నారు, ఈ బరువులు మోసి మీరు దుఃఖాలపాలవుతున్నారు. భగవంతుడు హృదయంలో ఉన్నాడు, ఆయనే అంతటా వ్యాపించి ఉన్నాడు, ఆయనకు ఈయనకు బేధం లేదు అని శాస్త్రం చెపుతోంది. శాస్త్రంలో చెప్పినది నాకు అనుభవంలోనికి రావటం లేదు. అది అనుభవంలోనికి రాకుండా ఏ బేదబుద్ధి అయితే నాకు అడ్డువస్తోందో దానిని తొలగించి ఆ అనుభవాన్ని నాకు కలుగజెయ్యి ఓ గురువాయురప్పా అంటాడు ఓ కవి. ఓ గురువాయురప్పా! నీకు బేధబుద్ధి లేదు, నాకు బేధబుద్ధి ఉంది. బేధబుద్ధి లేని నువ్వు బేధబుద్ధి ఉన్న నాకు గోచరించవు. నీవు గోచరించకుండా ఏ బేదబుద్ధి అయితే నాకు అడ్డువస్తోందో అది ఒక రోగం. అది శరీరంలో రోగం అయితే డాక్టరు వద్దకు వెళ్ళి తొలగించుకోవచ్చు కాని అది మనస్సులో ఉన్న రోగం. దానిని తొలగించుకోవటానికి సాధన చేస్తున్నాను కాని నీ దయ లేకుండా ఏమీ చేయలేనని తెలుస్తోంది. ఓ గురువాయురప్పా! నీ దయ చూపించి, నీ అనుగ్రహాన్ని చూపించి నాలో ఉన్న అజ్ఞానాన్ని, భేదబుద్ధిని తొలగించు అని ప్రార్థిస్తాడు. ఒకసారి భగవాన్‌ను ఒక భక్తుడు

నాకు మోక్షం వస్తుందా, రాదా అని చాదస్తంగా అడుగుతున్నాడు. నీకు మోక్షం వచ్చే యోగం లేకపోతే ఈ గుమ్మంలోకి రావు అన్నారు భగవాన్, అది కొంతకాలం పట్టవచ్చు, ఆ యోగమే నిన్ను ఇక్కడకు తీసుకొని వచ్చింది అన్నారు. భగవంతుడికి రూపంలేదు, నామంలేదు. ఆ రూపంలేనివాడు రూపం ధరించి వచ్చాడు. ఆ రూపాన్ని పట్టుకొని, ఆ నామాన్ని స్మరించుకొని రూపంలేనిదానిని, నామం లేనిదానిని పొందవయ్యా, సాకారాన్ని పట్టుకొని, నిరాకారాన్ని పొందు అంటున్నారు ఆచార్యుల వారు. నదిని దాటటానికి నావను ఎలా ఉపయోగించుకొంటారో అలాగ నీ శరీరాన్ని, ఇంద్రియాలను, మనస్సును ఉపయోగించుకొని ఈ శరీరానికి చావు రాకముందే అమృత స్థితిని పొందు అంటున్నారు ఆచార్యులవారు.

ఒకసారి రాముడు వశిష్ఠుడి దగ్గరకు వెళ్ళినప్పుడు వశిష్ఠుడు లోపల ఉన్నాడు, రాముడు తలుపు తడతాడు. వశిష్ఠుడు లోపల నుండి ఎవరు అని అడిగాడు. నేను అన్నాడు రాముడు. నేను, నేను అంటున్నావు ఆ నేను ఎవరు? అన్నాడు వశిష్ఠుడు. అప్పుడు రాముడు దశరథుడిగారి అబ్బాయిని అని చెపుతాడు. మీ తండ్రిపేరు ఏమిటి అని అడిగితే దశరథుడు అని చెప్ప. సరిగా అర్థం చేసుకో. నేను ఒకటి అడిగితే నీవు ఒకటి చెపుతున్నావు. నేను, నేను అంటున్నావు కదా ఆ నేను ఎవరు? ఆ నేను ఎవరో తెలిస్తే మోక్షం లేకపోతే బంధం. అది నీకు తెలియనప్పుడు నీవు శాశ్వతంగా బంధంలో ఉండవలసిందే. భగవాన్ చెప్పిన నేను ఎవడను అనే పుస్తకం బంగారం కాని అది మీకు రుచించటం లేదు. దానిని హితవు చేసుకొంటే, దానిని అర్థం చేసుకొంటే ఆ ఒక్క పుస్తకం చాలు, మిగిలిన వాటితో పని లేదు. నేను ఎవడను అనే పుస్తకంలో భగవాన్ ఏమి చెప్పారు అంటే కోటలో శత్రువులు ఉన్నంతసేపు ఆ కోట నీకు వశంకాదు. కోటలో ఉన్న శత్రువులు అందరూ బయటకు వస్తేనే, నీవు వారిని జయిస్తేనే ఆకోట నీకు వశమవుతుంది. అలాగే నీ హృదయంలో ఎన్ని వాసనలు అయితే ఉన్నాయో అవి ఒకటి తరువాత ఒకటి వస్తూనే ఉంటాయి. అవి ఎవరికి వస్తున్నాయి, ఎందుకు వస్తున్నాయి అని వాటిని విచారణ చేసి వాటిని పూర్తిగా తొలగించుకొంటే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది కాని ఒక్క వాసన మిగిలిఉన్నా నీవు ఆత్మలాభం పొందలేవు, అది పునర్జన్మకు కారణం అవుతుంది. అమెరికాలో ఒక సామెత ఉంది. మీరు సేఫ్‌గా ఉండండి. మీకు దుఃఖం వచ్చేవరకు ఆగకండి. అలా లోకాన్ని చూస్తూ ఉండండి. లోకంలో చాలా మంది దుఃఖపడుతూ ఉంటారు. వారు ఎందుకు దుఖఃపడుతున్నారు అని పరిశీలన చేస్తూ,

వారు ఏకారణం వలన దుఃఖపడుతున్నారో ఆకారణం జోలికి మీరు వెళ్ళకండి, మీరు సేఫ్‌గా వెళ్ళిపోతారు, దుఃఖం లేకుండా వెళ్ళిపోతారు అంటున్నారు. రోగం వచ్చాక తగ్గించుకోవటం కాదు రోగం రాకుండా చూసుకోవటం మంచిది అని చెపుతున్నారు. శరీరాన్ని ఇబ్బంది పెట్టకండి, మనస్సును ఇబ్బంది పెట్టకండి, శాంతిగా ఉండండి, అస్తమాను కుదిపేసుకోవద్దు. శరీరాన్ని, మనస్సును జాగ్రత్తగా ఉపయోగించుకోండి. శరీరాన్ని మనస్సును సమాజక్షేమం కోసం అయినా ఉపయోగించండి, భక్తిని పెంచుకోవటానికి అయినా ఉపయోగించండి అంతేగాని అస్తమాను అశాంతి తెచ్చుకొని శరీరాన్ని, మనస్సును పాడుచేసుకోవద్దు. దుఃఖం రాకుండా సేఫ్‌సైడు చూసుకోమని చెపుతున్నారు. దుఃఖం రాకుండా చూసుకోమని చెపుతున్నారు ఒకవేళ దుఃఖం వస్తే ఎలాగని కంగారుపడవద్దు, ఆదుఃఖాన్ని అనుభవిస్తే పోతుంది, దుఃఖాన్ని అనుభవిస్తున్నాము అని అనుకోవద్దు. లేటైతే వడ్డీతో సహా అనుభవించాలి, ఇప్పుడు వడ్డీ లేకుండా అనుభవిస్తున్నాము అనుకోండి. వశిష్ఠుడు ఏమి చెపుతున్నాడు అంటే అన్నం తినమన్నాడు. ఎందుకు తినమన్నాడు? ప్రాణం నిలబెట్టుకోవటానికి తినమన్నాడు. ప్రాణం ఎందుకు నిలబెట్టుకోవాలి? ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రాణం నిలబెట్టుకో, నీ జీవిత గమ్యం ఏదో దానిని పొందటానికి ప్రాణం నిలబెట్టుకో, ఆ ప్రాణం నిలబడటానికి అన్నం తిను అని చెప్పాడు. నేను అనే భావన మనకు లోపలనుండి వస్తోంది. నేను అనే భావన ఉన్నంత సేపు మనకు దేహభావన, దేవుడుభావన, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం, జన్మలు అన్నీ ఉంటాయి. ఆ నేను అనే భావన దాటితే, ఆ గుమ్మం దాటితే సద్భావస్థితిని పొందుతావు, చైతన్యస్థితిని పొందుతావు. అక్కడ జీవభావన ఉండదు, దైవభావన ఉండదు, లోక భావన ఉండదు. అక్కడ నువ్వు తప్పించి ఏదీలేదు? అప్పుడు ఏ భావనలు రావు కాని నీవు ఉంటావు. ఎలా ఉంటావు? ఉండటమే ఉండటం, ఆనందమే ఆనందం, శాంతే శాంతి. అది ఊహిస్తే మనకు తెలియదు అది అవ్వాలి. అక్కడ తప్పించి ఎక్కడా సుఖం లేదు, శాంతి లేదు. ఎక్కడ సుఖం లేదో అక్కడ సుఖం ఉందని మనం అనుకొంటాము, అది మన మూర్ఖత్వానికి గుర్తు. మనకు జ్ఞానం రాకపోవటానికి కారణం ఏమిటి అంటే ఎక్కడ మారాలో అక్కడ మారటం లేదు. మనం నాగరికత నేర్చుకొంటున్నాము, మాట్లాడే తీరు నేర్చుకొంటున్నాము కాని ఎక్కడ మారాలో అక్కడ మారటం లేదు.

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# బ్రహ్మ సాక్షాత్కారము

"నేనే బ్రహ్మము" అని తలచినంత మాత్రాన బ్రహ్మమగుదురా? అని సందేహించనవసరము లేదు. బ్రహ్మానుభవము లేకపోయినా, కలుగకపోయినా 'నేనే బ్రహ్మము' అని భావించి ధ్యానించాలి. ధ్యానము వలన లేనిది కూడా లభిస్తుంది. గురుముఖమున లభించిన మహావాక్య సంబంధమైన పరోక్ష బ్రహ్మ విజ్ఞానము అగ్నివలె బుద్ధిపూర్వకముగా జీవుడు చేసిన పాపపుణ్యములను కాల్చివేయును. అపరోక్షజ్ఞానము సంసారమునకు కారణమైన అజ్ఞానమనెడి అంధకారమునకు సూర్యుడు.

పరోక్షజ్ఞానము అనగా, జీవ బ్రహ్మములొక్కటే అని మొదట కల్గు సామాన్య జ్ఞానము. అపరోక్షజ్ఞానము అనగా "నేను బ్రహ్మము" అను విశేష జ్ఞానము కలుగుట. యావజ్జీవితము విచారణ చేసినా బ్రహ్మసాక్షాత్కారము కలుగకపోయినా నిరాశ చెందకూడదు. ప్రతిబంధకములు తొలగిపోగానే జన్మాంతరములందు అయినా తప్పక బ్రహ్మసాక్షాత్కారము కలిగితీరుతుంది.

**- బొప్పన అరుణాదేవి, హైదరాబాదు**



జూలై నెల 2వ తేదీన చింతపర్రు షిరిడి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో
ప్రసంగించిన సద్గురు శ్రీ నాన్నగారు



జూలై నెల 2వ తేదీన చింతపర్రు గ్రామంలో కలిదిండి సత్యనారాయణరాజుగారు నిర్మించిన
షిరిడిసాయి మహాప్రసాద భవనంలో సద్గురు శ్రీ నాన్నగార్కి స్వాగతం చెపుతున్న వేంద్ర పేపరు
మిల్లు జనరల్ మేనేజరు శ్రీ పెన్మెత్స చంద్రశేఖర వర్మగారు